ఎపి టెట్‌కు రంగం సిద్ధం : డిఇఒ అబ్రహం

ఏలూరు స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వంచే నిర్వహింపబడుతున్న ఎపి టెట్ 2024 పరీక్షలను ఈనెల 27వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకు నిర్వహించేందుకు రంగ సిద్ధం చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో నాలుగు సెంటర్లలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. డిఇఒ అబ్రహం తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వంచే నిర్వహింపబడుతున్న ఎపి టెట్ 2024 పరీక్ష ఈనెల 27వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా నాలుగు సెంటర్లను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారన్నారు. ఈ పరీక్షలు పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు కావడంతో ఆయా సెంటర్లలో ఏర్పాటుచేసిన కంప్యూటర్లలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. హాల్ టికెట్లలో ఏమైనా మార్పులు చేసుకోవాల్సి వచ్చిన ఎడల ప్రస్తుతం ఉన్న నాలుగు పరీక్ష కేంద్రాలలో వీటిని మార్పు చేసేందుకు అక్కడ సిబ్బంది అందుబాటులో ఉన్నారని ఆయన తెలిపారు. సరైన ధృవీకరణ కలిగిన గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరుకావాలని ఆయన సూచించారు.

7లో 5 జనసేనకేనా..!

- టిడిపి, జనసేన నేతల్లో తీవ్ర చర్చ
- మిగిలిన ఏడు స్థానాల ఆశావహుల్లో టిక్కెట్ టెన్షన్
- టిడిపి సీనియర్ నేతలు చింతమనేని, గన్నికి తొలి జాబితాలో దక్కనిచోటు
- అసంతృప్తులు మరింత పెరిగే అవకాశం
- వైసిపి అభ్యర్థుల్లోనూ మార్పుకు అవకాశమంటూ ప్రచారం?

'ఐదు, పదేళ్ల నుంచి కష్టపడుతున్నాం. పార్టీ కోసం ఎంతో ఖర్చు చేశాం. నిరంతరం ప్రజల్లోనే ఉన్నాం.. తీరా ఎన్నికలొచ్చేసరికి టిక్కెట్ వస్తుందో లేదో పరిస్థితి నెలకొంది. ఇటువంటి పరిస్థితి ఎవరికి రాకూడదంటూ' టిడిపి, జనసేన నేతల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఇప్పటికే టిడిపి, జనసేన ప్రకటించిన తొలి జాబితాలో పలువురికి చోటు దక్కకపోవడం, ఇంకా ప్రకటించాల్సిన ఏడు స్థానాల్లో అత్యధికం జనసేనకు కేటాయించే అవకాశం ఉండడంతో ముఖ్యంగా టిడిపి నేతల్లో గుబులు రేపుతోంది. రెండో జాబితా ప్రకటన తర్వాత అసంతృప్తి జ్వాలలు మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషణ కొనసాగుతోంది. వైసిపిలోనూ పలుచోట్ల అభ్యర్థులను మార్చే అవకాశం ఉందన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. టిడిపి, జనసేన పొత్తులో భాగంగా ఏడు స్థానాలకు సంబంధించి ఉమ్మడి తొలి జాబితాను శనివారం ప్రకటించారు. ప్రకటించిన ఏడు స్థానాల్లో తణుకు, ఏలూరు, టిక్కెట్ ఆశించిన జనసేన నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొనగా, ఉండి, నూజివీడు టిక్కెట్ ఆశించిన టిడిపి నేతల్లో అసంతృప్తి జ్వాలలు చెలరేగాయి. ఇంకా ఏడు స్థానాలకు సంబంధించి అభ్యర్థులను టిడిపి, జనసేన ప్రకటించాల్సి ఉంది. తొలి జాబితాలో ప్రకటన చేసినా ఏడు స్థానాల్లో జనసేన అభ్యర్థులు ఒక్కరు కూడా లేరు. రెండో జాబితాలో ప్రకటించే ఏడు స్థానాల్లో ఐదుచోట్ల జనసేన అభ్యర్థులు ఉండే అవకాశం ఉందని చెబుతున్న పరిస్థితి ఉంది. ఒకవేళ ఒకస్థానం బిజెపికి ఇచ్చి జనసేనకు మరోస్థానం తగ్గించినా రెండో జాబితాలో టిడిపికి మిగిలే స్థానాలు రెండుకంటే ఎక్కువగా ఉండవని టిడిపి, జనసేన నేతలు లెక్కలు కడుతున్నారు. దీంతో టిడిపి, జనసేన నేతల్లో టిక్కెట్ టెన్షన్ పట్టుకుంది. ముఖ్యంగా టిడిపిలో సీనియర్ నాయకులుగా ఉన్న గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్‌కు సైతం తొలిజాబితాలో చోటు దక్కలేదు. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పోలవరం స్థానాలను జనసేనకు కేటాయించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఒకవేళ బిజెపితో పొత్తు కుదిరితే కైకలూరు బిజెపికి కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. టిడిపి జిల్లా అధ్యక్షునిగా ఉన్న గన్ని వీరాంజనేయులుకు ఉంగుటూరు టిక్కెట్ ఉంటుందా లేదా అన్న చర్చ కొనసాగుతోంది. దెందులూరు టిక్కెట్ చింతమనేనికి కేటాయిస్తారా లేక మార్పు ఉంటుందా అన్న అనుమానం సైతం నెలకొంది. దీంతో రెండో జాబితాపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీ కోసం నిరంతరం కష్టపడినా టిక్కెట్ కోసం నిరీక్షణ తప్పడం లేదంటూ సీనియర్ నాయకుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తొలి జాబితా ప్రకటన తర్వాత ఏలూరు, తణుకులో టిక్కెట్ ఆశించిన జనసేన నేతలు రెడ్డి అప్పలనాయుడు, విడివాడ రామచంద్రరావు తీవ్ర ఆగ్రహంతో ఉండగా, ఉండి, నూజివీడులో టిడిపి ఆశావహ అభ్యర్థులు శివరామరాజు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మండిపడుతున్న పరిస్థితి నెలకొంది. రెండో జాబితా ప్రకటన తర్వాత అసంతృప్తి జ్వాలలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఉంగుటూరు టిక్కెట్ టిడిపికి కేటాయిస్తే జనసేన నేతలు, జనసేనకు కేటాయిస్తే టిడిపి నేతల్లో అసంతృప్తి కొనసాగనుంది. పోలవరం టిక్కెట్ జనసేనకు కేటాయిస్తే టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న బొరగం శ్రీనివాస్ అలకబూనే పరిస్థితి ఏర్పడనుంది. దీంతో టిక్కెట్ల కేటాయింపుల తర్వాత రాజకీయ పరిస్థితుల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.

వైసిపిలోనూ అభ్యర్థుల మార్పునకు అవకాశమా?

ఇప్పటికే వైసిపి అన్ని నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను నియమించింది. వీరే అభ్యర్థులంటూ చెప్తూనే చెప్పేసింది. కానీ కొన్నిచోట్ల అభ్యర్థులు బలహీనంగా ఉన్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. టిడిపి, జనసేన అభ్యర్థుల ప్రకటన తర్వాత అసంతృప్తులను చేర్చుకుని కొన్నిస్థానాల్లో అభ్యర్థులను మార్చివేసే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో అసెంబ్లీ సీట్లకు సంబంధించి మరికొన్ని రోజులు ఉత్కంఠ కొనసాగనుందని చెప్తున్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి లావణ్య వేణి

అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసు

ప్రశాంతంగా గ్రూప్ - 2 పరీక్షలు

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ - జెసి లావణ్య వేణి

ప్రజాశక్తి - ఏలూరు

ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఏలూరు జిల్లాలో 39 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 13,977 మంది హాజరు కావాల్సి ఉండగా 11,696 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. 2,281 మంది గైర్హాజరయ్యారన్నారు. ఏలూరు రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల, సిఆర్‌రెడ్డి ఉమెన్స్ కళాశాలలో జరిగిన గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు, అభ్యర్థుల సంతకాల రిజిస్టర్లను పరిశీలించారు. రోల్ నంబర్ ప్రకారం సిటింగ్ జరిగిందా లేదా అని పరిశీలించారు. పరీక్ష సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

గ్రూప్ - 2 పరీక్షకు హాజరైన అభ్యర్థులు

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జెసి లావణ్య వేణి

గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తనిఖీ చేశారు. సర్ సిఆర్‌రెడ్డి కళాశాల తదితర కళాశాలల్లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. అభ్యర్థుల హాజరు, రోల్ నంబర్ ప్రకారం సీటింగ్ అరేంజ్మెంట్లు తదితర అంశాలను ఆరా తీశారు. అలాగే జెసి సెయింట్ థెరిసా స్కూల్, కెపిడిటి స్కూల్లో పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. వారి వెంట ఏలూరు ఆర్‌డిఒ ఎన్‌ఎస్‌కె.ఖాజావలి, ఎపి పిఎస్‌సి జోనల్ మేనేజర్ కె.బాబ్జీ ఉన్నారు.

గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షకు ఏలూరులో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఏలూరు రేంజ్ ఐజి జిజిబి.అశోక్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. సెయింట్ థెరిస్సా కళాశాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించి అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట ఏలూరు జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి, డిఎస్‌పి శ్రీనివాసులు, అధికారులు ఉన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఏలూరు జిల్లా వృత్తి విద్యాధికారి ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఏలూరు జిల్లా వృత్తి విద్యాధికారి, జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకర్‌రావు తెలిపారు. జిల్లాలో మొత్తం ఎన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు, మాస్ కాపీయింగ్ నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, సెన్సిటివ్ కేంద్రాలు ఏమైనా గుర్తించారా? తదితర ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న : ఇంటర్మీడియట్ పరీక్షలు ఎప్పటి నుంచి ఎప్పటి వరకు జరగనున్నాయి? ఏలూరు జిల్లాలో ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు?

జవాబు : మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరగనున్నాయి. ఈ పరీక్షలకు ఏలూరు జిల్లాలో 51 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రశ్న : జిల్లాలో మొత్తం ఎన్ని కళాశాలలు ఉన్నాయి? మొత్తం ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు?

జవాబు : జిల్లాలో మొత్తం 124 ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి. అందులో ప్రభుత్వ కళాశాలలు 20, ఎయిడెడ్ కళాశాలలు 2, సాంఘిక సంక్షేమ శాఖ కళాశాలలు 6, గిరిజన సంక్షేమ శాఖ కళాశాలలు 3, కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలలు 3, ప్రయివేట్ కళాశాలలు 90 ఉన్నాయి. ఈ కళాశాలల నుంచి 14,924 మంది బాలురు, 17,521 మంది బాలికలు కలిపి మొత్తం 32,445 మంది పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న : పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

జవాబు : పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌తో ఏర్పాటు చేయడం జరిగింది. అన్ని కెమెరాలూ జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానమై ఉంటాయి. 08812 230197 నంబర్‌తో జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం.

ప్రశ్న : మాస్ కాపీయింగ్ నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : అన్ని పరీక్షా కేంద్రాలకూ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లను నియమించడం జరిగింది. అలాగే ఇంటర్ బోర్డు నుంచి ఒకరు, రెవెన్యూ శాఖ నుంచి ఒకరు, పోలీస్ డిపార్ట్మెంట్ నుంచి ఒకరు మొత్తం ముగ్గురితో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశాం. వీరు అన్ని కేంద్రాలనూ పర్యవేక్షిస్తూ ఉంటారు. అలాగే 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల వరకూ జిరాక్స్ షాపులు మూసివేయడం జరుగుతుంది.

ప్రశ్న : 51 కేంద్రాలకు సరిపడా ఇన్విజిలేటర్లు ఉన్నారా? తక్కువైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏమైనా చేశారా?

జవాబు : ప్రస్తుతానికి సరిపడా ఇన్విజిలేటర్లు ఉన్నారు. తక్కువైతే విద్యాశాఖ నుంచి తీసుకునేలా జిల్లా విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

ప్రశ్న : విద్యార్థులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించారు?

జవాబు : అన్ని పరీక్షా కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు సౌకర్యాలు కల్పించాం. తగినంత వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకున్నాం. అన్ని కేంద్రాల్లో ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో ఒక ఎఎన్ఎం ఉండేలా వైద్యారోగ్య శాఖ ద్వారా చర్యలు తీసుకున్నాం. అంతేగాక 51 సెంటర్ల జాబితా ఆర్‌టిసి అధికారులకు పంపి ఉదయం 7 గంటల నుంచి పరీక్షా కేంద్రాలకు బస్సులు అందుబాటులో ఉండేలా, ఆ బస్సుల్లో విద్యార్థులకు ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లకు గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పంచాయతీ అధికారికి కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులకు కూడా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రశ్న : జిల్లాలో సెన్సిటివ్ ప్రాంతాలను ఏమైనా గుర్తించారా?

జవాబు : జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను సెన్సిటివ్ ప్రాంతాలుగా గుర్తించి, ఇలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నాం.

ప్రశ్న : పరీక్షల విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఏం సూచనలు చేశారు?

జవాబు : పరీక్షలపై 51 కేంద్రాల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించాం. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించబోవద్దని తెలిపాం. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరిగినా డిపార్ట్మెంటల్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపాం.

ప్రశ్న : చివరిగా విద్యార్థులకు మీరిచ్చే సూచన ఏంటి?

జవాబు : విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఆర్‌టిసి ఏర్పాటు చేసిన బస్సుల్లో సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటువంటి చర్యలకు పాల్పడి విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు.

కలయిక.. కలిసొచ్చేనా..!

- పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటనతో జనసేనలో జోష్
- నిస్తేజంలో టిడిపి.. ఆపై మరింత ముదిరిన గ్రూపుల పోరు
- మాజీ ఎంఎల్ఎ అంజిబాబుతో పవన్ ప్రత్యేక భేటీపై సర్వత్రా చర్చ
- జనసేన నుంచి పోటీకి సై అంటున్న అంజిబాబు!

ప్రజాశక్తి - భీమవరం



భీమవరంలో జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ పర్యటనలో నేతల ఆత్మీయ కలయిక ఆ పార్టీకి ఎంతవరకూ కలిసొస్తుందనే దానిపై విస్తృత చర్చలు సాగుతున్నాయి. జనసేనాని పర్యటనతో భీమవరం జనసేన జోష్‌లో ఉండగా టిడిపి మాత్రం తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతోంది. మాజీ ఎంఎల్ఎ అంజిబాబుతో పవన్ భేటీ వెనుక ఆంతర్యం ఏంటనే దానిపై పలు ఊహాగానాలు విన్పిస్తున్నాయి. ఒకపక్క భీమవరం నుంచి పవన్ పోటీ చేస్తారని విస్తృతంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, అవకాశం ఇస్తే జనసేన నుంచి తాను పోటీలో ఉంటానని అంజిబాబు ప్రకటించడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన నడుమ పొత్తు ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే చర్చ మొదలైంది.

భీమవరం రాష్ట్ర రాజకీయాలను దృష్టి మళ్లించిన అసెంబ్లీ స్థానం. గత ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇక్కడ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. మళ్లీ ఇదే స్థానం నుంచి పోటీ చేయాలని దృఢ సంకల్పంతో ఉన్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. పవన్ అధికారికంగా ప్రకటన చేయనప్పటికీ తాను ఇక్కడి నుంచి బరిలోకి దిగనున్నట్లు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భీమవరం రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గత ఎన్నికల్లో టిడిపి, జనసేన విడివిడిగా పోటీ చేశాయి. ఇప్పటికే టిడిపి, జనసేన పొత్తు ఏర్పాటు చేసుకొని ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటన ఆ పార్టీకి మంచి మైలేజ్ తెచ్చి పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. పవన్ కూడా గత మాదిరిగా కాకుండా ఈ సారి ఎన్నికలకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఇళ్లకు వెళ్లడం ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రధానంగా అంజిబాబుతో ప్రత్యేకంగా భేటీకావడం చర్చనీయాంశమైంది. దీంతో టిడిపిలో గతం నుంచి ఉన్న ముసలం మరింత ముదిరినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన పొత్తు ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే అంశంపై పెద్దఎత్తున చర్చ సాగుతోంది.

టిడిపిలో ముదిరిన గ్రూపుల పోరు

టిడిపి జిల్లా అధినాయకత్వం వ్యవహార శైలితో భీమవరం టిడిపిలో నెలకొన్న గ్రూపుల పోరు పవన్ పర్యటనతో మరింత ముదిరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇక్కడ టిడిపి రెండు గ్రూపులుగా చీలిపోయింది. భీమవరం పర్యటనకు వచ్చిన పవన్ టిడిపి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి ఇంటికి వచ్చి భీమవరం నియోజకవర్గ టిడిపి నేతలు, కార్యకర్తలను కలుసుకోకుండా వెనుదిరగడంపై తెలుగు తమ్ముళ్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమను కలిసేందుకు కూడా రాలేని వ్యక్తితో తాము ఎలా ముందుకు సాగగలమని, ప్రజలే ఈ విషయాన్ని అడిగితే ఏం సమాధానం చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు సీతారామలక్ష్మితోపాటు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ టిడిపి శ్రేణులను సముదాయించినప్పటికీ వారు మాటకు మాట చెప్పడం చర్చనీయాంశమైంది.

అంజిబాబు ఆంతర్యం ఏమిటో..!

మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఇంటికి స్వయంగా పవన్ కళ్యాణ్ వెళ్లి ఆత్మీయంగా కలుసుకోవడం చర్చనీయాంశమైంది. టిడిపి జిల్లా ముఖ్య నేతలు, ఇన్‌ఛార్జీలు, ఎంఎల్ఎలు అంతా టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఇంటి దగ్గర ఉంటే అంజిబాబు మాత్రం అక్కడకు రాలేదు. దీనికితోడు పవనే నేరుగా అంజిబాబు ఇంటికి వెళ్లడం రాజకీయ దుమారాన్ని రేపింది. అంజిబాబుతోపాటు ఆయన కుమారుడు కూడా పవన్ భీమవరం నుంచి పోటీ చేస్తే గెలుపునకు అన్నివిధాలా కృషి చేస్తామని పవన్‌కు భరోసా ఇచ్చారు. ఇదిలాఉంటే ఒకవేళ పవన్ కళ్యాణ్ భీమవరం నుంచి పోటీ చేయకపోతే తనకు అవకాశం ఇస్తే పోటీ చేస్తానని అంజిబాబు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ఒకవైపు జనసేన నుంచి పోటీ చేస్తానని చెబుతూనే, నేను టిడిపిలో ఉన్నాను కాబట్టి అవకాశం వస్తే టిడిపి నుంచి కూడా పోటీ చేస్తానని చెబుతుండటంతో అసలు అంజిబాబు ఆంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకొందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఏదేమైనా పవన్ బరిలో లేకపోతే టిడిపి లేదా జనసేన నుంచి తాను బరిలో ఉంటానని అంజిబాబు చెప్పకనే చెబుతున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

పోటీపై స్పష్టత ఇవ్వకపోవడంపై అయోమయంలో కేడర్

టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటించారు. జిల్లాలో ఉండి, పాలకొల్లు, ఆచంట, తణుకు నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులను ప్రకటించారు. మిగిలిన భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం నియోజకవర్గాలకు అభ్యర్థులు ప్రకటించాల్సి ఉంది. అయితే నాలుగు స్థానాలను టిడిపికి కేటాయించడంతో మిగిలిన మూడు జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే భీమవరం నుంచి ఆది నుంచి పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారని చెబుతున్నప్పటికీ అభ్యర్థిగా ప్రకటించకపోవడం చర్చనీయాంశమైంది. నూరు శాతం పోటీ ఇక్కడ నుంచే ఉంటుందని భావించినప్పటికీ పోటీపై పవన్ స్పష్టత ఇవ్వకపోవడంతో జనసేన కేడర్ అయోమయంలో ఉంది. ఒకవేళ పవన్ పోటీ చేయకపోతే మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు జనసేన నుంచి పోటీలో ఉంటారని జోరుగా ప్రచారం సాగుతోంది. భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు కూడా అంజిబాబుకే అప్పగిస్తారని ప్రచారం జోరందుకుంది. దీంతో ఉమ్మడి పొత్తు ఏ పార్టీకి కలిసొస్తుంది, ఏ అభ్యర్థి విజయానికి తోడ్పాటునిస్తుందన్నది తెలియాల్సి ఉంది.

ఇ-చలానాలు రద్దు చేయాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎంఎల్ఎకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆటో, క్యాబ్ వాహనాలపై ఇ-చలానాలను రద్దు చేయాలని, సీసీ కెమెరాలు చలానాలు విధించడానికి వినియోగించడం నిలిపివేయాలని కోరుతూ ఆదివారం ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నానికు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జె.గోపి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆళ్లనాని మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తానని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. ఏలూరు నగరంలో అస్తవ్యస్తంగా, సాంకేతిక లోపాలతో సీసీ కెమెరాలు ఇ-చలానాలను విధిస్తున్నాయని, వీటిని తక్షణమే రద్దు చేయాలని గోపి డిమాండ్ చేశారు. పాత బస్టాండ్ సెంటర్లో స్టాప్ లైన్, జీబ్రా లైన్ మధ్య దూరం దాదాపు 20 మీటర్ల పెట్టడం సరైన చర్య కాదని ఆరోపించారు. ఏలూరు నగరంలో దాదాపుగా 7 వేల మంది ఆటో డ్రైవర్లు మరో మూడు వేల మంది క్యాబ్ డ్రైవర్లు ఇ-చలానాల వల్ల తమ ఆదాయాన్ని కోల్పోతున్నారని విమర్శించారు. క్యాబ్ వాహనాలకు రోడ్ టాక్స్ చెల్లించాలన్న, ఆటోలకు ఫిట్నెస్ చేయించుకోవాలన్నా ఇ-చలానాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇ-చలానాలు రద్దు చేయకుంటే తామంతా తీవ్రంగా నష్టపోతామని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధమవుతామని తెలిపారు. సిఐటియు ఆటో యూనియన్ నాయకులు బుద్ధ నాగసూరిబాబు, చక్రాల అమర్ కుమార్, మెరుగు రాఘవ పాల్గొన్నారు.

రైతు, కార్మిక విధానాలను నిరసిస్తూ నేడు ట్రాక్టర్ల ర్యాలీ

ప్రజాశక్తి - ముసునూరు

చింతలపూడిలో మాట్లాడుతున్న దొంత కృష్ణ

దేశంలోని రైతులు, కార్మికులందరూ సమైక్యంగా భారత ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న నిర్వహిస్తున్న ట్రాక్టర్లు, ఇతర వాహనాల ర్యాలీలను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు పండిస్తున్న అన్ని పంటలకు కనీస మద్దతు ధరల చట్టం కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని తెలిపారు. విద్యుత్ రంగంలో కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న సంస్కరణలు నిలిపివేయాలన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అమలు చేయాలని, హర్యానా, ఢిల్లీ బోర్డర్లో రైతులపై కాల్పులు జరిపిన హర్యానా పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికుల హక్కులను పునరుద్ధరించాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని, రోజుకు రూ.600 కూలీ ఇస్తూ సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని తెలిపారు. రూ.2 లక్షల వరకు రైతుల రుణాలు ఒక దఫ మాఫీ చేయాలని, కేరళ తరహా రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలని, సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలని అన్నారు. 2023వ సంవత్సరం ఖరీఫ్‌లో కరువు, తుఫాన్లతో నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ ఈనెల 26న నూజివీడు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరుగుతున్న కార్యక్రమానికి మండలంలోని 16 గ్రామాల రైతులందరూ పాల్గొనాలని కోరారు.

చింతలపూడి : రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మోటార్ సైకిల్ ర్యాలీ ఈనెల 26న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చింతలపూడి ఫైర్ స్టేషన్ నుంచి పాత బస్టాండ్ వరకు జరుపుతామని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ తెలియజేశారు. డబ్ల్యూటిఒ ప్రపంచ దేశాల రైతు, కార్మిక వ్యతిరేక విధానాల సమావేశాలు అబుదాబిలో జరుగుతున్నందుకు వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సమావేశాలలో రైతాంగ, కార్మిక అనుకూల విధానాలు నిర్ణయించాలని రెనానే. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.మాణిక్యాలరావు, షేక్ కాలీషా, కౌలు రైతు సంఘ నాయకులు రావెళ్ల రాజారావు, జిల్లా కమిటీ సభ్యులు టి.ప్రసాద్, సిపిఐ మండల కార్యదర్శి కె.గురవయ్య, సిపిఎం మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

హెచ్చరికగా చుట్టూ రిబ్బన్లు కట్టిన గ్రామస్తులు

ప్రమాదకరంగా బోరుబావి..

హెచ్చరికగా ఎర్ర రిబ్బన్లు ఏర్పాటు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కొత్త ఉంగుటూరులోని జగనన్న ఇళ్ల స్థలాల లేఅవుట్ వద్ద నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రమాదకర బోరు బావిని స్థానికులు గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. నారాయణపురంలో లబ్ధిదారులకు ఉంగుటూరు పంచాయతీలో భూసేకరణ చేసి మెరక చేసి ఇళ్ల స్థలాల కోసం ప్లాటుగా వేశారు. అట్టహాసంగా ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. జగనన్న కాలనీలో తాగునీటి బోరుకు అధికారిక అనుమతులు, నిధులు మంజూరు కాకుండానే ఓ గుత్తేదారుడు సుమారు 15 అంగుళాల వెడల్పు, 20 అడుగులకుపైగా లోతు వరకూ బోరుబావి కోసం డ్రిల్లింగ్ చేసి ఆపేసి వెళ్లిపోయాడు. అలా నిర్లక్షంగా వదిలేసిన బోరుబావిపై ఎలాంటి రక్షణ వలయం కాని, హెచ్చరిక బోర్డులు కాని పెట్టలేదు. అక్కడ ఆడుకునే పిల్లలు ఎవరైన అందులో పడిపోతే ప్రాణాలు పోవడం ఖాయమని ఆందోళన చెందిన స్థానికులు ఉంగుటూరు సర్పంచికి సమాచారం ఇచ్చారు. దీంతో సర్పంచి బండారు సింధుమధు వెంటనే బోరు బావిని సందర్శించి బావిపై అడ్డంగా రాళ్లుపెట్టి చుట్టూ ఎర్ర రిబ్బనుతో హెచ్చరిక ఉంచారు. సుమారుగా నాలుగు నెలల నుంచి బావి ఉంటున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా స్థానికుల ఫిర్యాదుతో పెను ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అస్సలు మాకు తెలియకుండా గుత్తేదారుడు బోరు బావి సగం నిర్మించి వదిలేసి వెళ్లిపోయినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ సిబ్బంది జాని వెల్లడించారు. బోరుబావి నిర్మించిన విషయం మా దృష్టికి రాలేదని తవ్వి వదిలేచిన బోరుబావిని పూడ్పించే చర్యలు తీసుకుంటామని హౌసింగ్ ఎఇ సురేష్‌బాబు ప్రజాశక్తికి వివరించారు. జల జీవన్ మిషన్‌లో అన్ని అనుమతులు ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారానే జరుగుతాయని మా శాఖకు సంబంధం లేదని ఎఇ వివరించారు.

బాలుర వసతి గృహం సందర్శన

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడులోని ఇంటిగ్రేటెడ్ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్ ఆకస్మిక తనిఖీ చేసి శనివారం రాత్రి బస చేశారు. పదవ తరగతి విద్యార్థులతో పాఠ్యాంశాలు, స్టడీస్ విషయమై గురించి చర్చించారు. విద్యార్థుల ప్రగతిని ట్యూటర్లతో కలసి పరిశీలించారు. ఇంగ్లీష్ ట్యూటర్‌తో కలసి ఇంగ్లీష్ గ్రామర్ విషయంలో విద్యార్థుల అవగాహనను గుర్తించారు. హాస్టల్ విద్యార్థులతో విద్యా విషయంలో ప్రగతిని పరిశీలించారు. పదవ తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలసి రాత్రి భోజనం చేసి, భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, అందిస్తున్న వసతుల గురించి విద్యార్థులను ఆరా తీశారు. రాత్రి బసలో వసతి గృహ సంక్షేమ అధికారి, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి నూజివీడు వారు పాల్గొన్నారు.



విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందజేస్తున్న గన్ని

'మన ఇంటికి గన్ని'కి ఆదరణ

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గం పరిధిలో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మన ఇంటికి గన్ని కార్యక్రమంకు ఆదరణ లభిస్తుందని ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. మండలంలోని కోడూరుపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా గన్ని వీరాంజనేయులు ఆదివారం సాయంత్రం మన ఇంటికి గన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. గడపగడపకు తిరిగి రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరిస్తే కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. అంతకుముందు గ్రామంలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలతో మమేకమయ్యారు. ఇదే కార్యక్రమంలో భాగంగా గన్ని వీరాంజనేయులు రానున్న ఎన్నికల్లో ఎంఎల్‌ఏగా ఎంపిక కావాలని కోరుతూ భీమడోలుకి చెందిన ఆ పార్టీ నాయకులు రాచప్రోలు రాజకుమార్ తన అనుచరులతో కలిసి భీమడోలు నుంచి గౌరీపట్నం మేరీ మాత ప్రార్థనాలయం వరకు పాదయాత్రను చేపట్టి పూర్తి చేశారు. యాత్ర పూర్తయిన నేపథ్యంలో గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా గ్రామానికి చెందిన 50 మంది విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, రాత అట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని టిడిపి ప్రముఖులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు పలు భవనాలు ప్రారంభం

టి.నరసాపురం: మండలంలో సోమవారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజుతో పాటు ఇన్‌ఛార్జులు విస్తృత పర్యటన చేస్తారని, ఈ సందర్భంగా నూతన ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు చేస్తారని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు) ఆదివారం విలేఖరులకు తెలిపారు. మండలంలోని తెడ్లం గ్రామంలో సచివాలయం, గుడ్లపల్లిలో సొసైటీ మల్టీ పర్పస్ గోదాము, కె.జగ్గవరంలో సచివాలయం, బంధంచర్లలో సచివాలయం, విలేజ్ క్లీనిక్, రైతు భరోసా కేంద్రం, టి.నరసాపురంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లీనిక్ నూతన భవనాలు ప్రారంభోత్సవాలు చేస్తారని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టరు ఢీకొని రైతు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు- నాచుగుంట పంట పొలాల దారిలో ఆదివారం ట్రాక్టర్ ఢీకొని రైతు మృతి చెందాడు. ఉంగుటూరుకు చెందిన అంపా భాస్కరరావు (65) రైల్వే ఉద్యోగిగా చేసి వాలంటరీ రిటైర్‌మెంట్ అయ్యాడు. అప్పటి నుంచి వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో కాగుపాడు రోడ్డులోని తన పొలానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా అదే దారిలో వస్తున్న చేబ్రోలు నుంచి వస్తున్న ట్రాక్టరు భాస్కరరావును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయనను తొలుత తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మణికుమార్ పేర్కొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మద్యానికి బానిసైన యువకుడు అనారోగ్యంతో బాధపడుతూ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం వెనకడిమి గ్రామానికి చెందిన కడమంచి వినయ్ బాబు(24) స్థానికంగా ఖాళీగా ఉంటున్నాడు. కొంతకాలం క్రితం తండ్రి మరణించాడు. ప్రస్తుతం వినయ్ మద్యానికి బానిసై, ఈక్రమంలోనే కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. ఇంట్లో జాగ్రత్తలు చెప్పే వారెవరు లేకపోవడం, మరోవైపు మద్యానికి బానిస కావడంతో, ఏమి చేయాలో పాలుపోని స్థితిలో వినయ్ ఆదివారం ఉదయం ఏలూరు జూట్ మిల్ వంతెన సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ నరసింహారావు స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. రైల్వే ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సొంతింటి కల సాకారమే ధ్యేయం

లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

'జగనన్న- వాసన్న' మోడల్ కాలనీలో పూర్తయిన అభివృద్ధి కార్యక్రమాలు

పాలసానిపల్లి సర్పంచి షేక్ రహీమా బేగం

ప్రజాశక్తి - భీమడోలు

పాలసానిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి కుటుంబానికీ స్థలం సమకూర్చడంతో పాటు గృహ నిర్మాణ సంస్థ సహకారంతో సొంతింటి కల సాకారం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. సర్పంచిగా మూడేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో తన హయాంలో గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన, కొనసాగుతున్న సంక్షేమ పథకాల గురించి ఆమె వివరించారు. జగనన్న గృహ నిర్మాణ పథకం కింద గ్రామంలోని మూడు కాలనీల్లో గృహ నిర్మాణాల కోసం లక్షలాది రూపాయల వ్యయంతో భూసేకరణ చేపట్టామన్నారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు గ్రామాభివృద్ధికి వివిధ రూపాల్లో సహకరిస్తున్న నేపథ్యంలో జాతీయ రహదారి పక్కన గల 44 ఇళ్ల సముదాయంలో జగనన్న - వాసన్న కాలనీగా పేరు పెట్టామన్నారు. కాలనీ నిర్మాణానికి ముందే లబ్ధిదారులు నిర్మాణాల కోసం ఇబ్బంది పడకుండా అవసరమైన విద్యుత్ లైన్లు, తాగునీరు, రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం మోడల్ కాలనీగా రూపొందిందని తెలిపారు. దీని సమీపంలోనే ఆజాద్‌కి అమృత్ నిధులతో చెరువును అభివృద్ధి చేశామని, అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణ కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రక్షిత మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని, మరో రెండు కాలనీల్లో 103,20 గృహ నిర్మాణాల కోసం భూ సేకరణ పూర్తయ్యిందని తెలిపారు. అక్కడ నిర్మాణాలు ప్రారంభం కావడానికి ముందే రోడ్లు, తాగునీరు, విద్యుత్ పనులు పూర్తయ్యాయన్నారు. ఈ కాలనీలకు వెళ్లేందుకు అనుసంధాన రోడ్ల నిర్మాణానికి భూసేకరణ జరిగినప్పటికీ నిధులు విడుదల కాక ఆ ప్రాంతాల్లో నిర్మాణాలు ప్రారంభం కాలేదని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామ పరిధిలో ఇంకా ఇళ్లు మంజూరైన 200 కుటుంబాలకు భూసేకరణ చేయాల్సి ఉందన్నారు.

ఇవన్నీ పూర్తయితే గ్రామ పరిధిలో స్థలంతో పాటు ప్రభుత్వం అందించే రాయితీలతో సుమారు రూ.10 లక్షల విలువైన సొంతిల్లు ఒక్కొక్క కుటుంబానికి దక్కుతుందన్నారు. దీనికి అదనంగా సొంత స్థలాలు గల లబ్ధిదారుల గృహ నిర్మాణాల కోసం నిధుల కేటాయించినట్లు తెలిపారు.

గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా భీమడోలు, ద్వారకా తిరుమల రోడ్డు విస్తరణ సందర్భంగా రోడ్డు దిగువ భాగానికి చేరిన పైపులైన్ వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులకు సంబంధించి రోడ్డుకు రెండు వైపులా నూతన పైపులైను ఏర్పాటు చేశామన్నారు. అలాగే గ్రామంలో పలు రక్షిత నీటి పథకాలను అనుసంధానం చేశామన్నారు. వీటిలో ఒక పథకానికి 24 గంటల విద్యుత్ సరఫరా ఉండే విధంగా అదనపు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. నిరంతరంగా గోదావరి తాగునీటిని అందుబాటులో ఉంచేందుకు గ్రౌండ్ లెవెల్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించామన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం సమర్థవంతంగా పనిచేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. జలజీవన్ మిషన్ నిధులతో పైపులను వేయడంతో పాటు, ఆ పథకం కింద 150 వరకూ కుళాయిలు అర్హులకు ఉచితంగా సమకూర్చినట్లు తెలిపారు. గ్రామంలో లోవోల్టేజ్ సమస్య తీర్చే క్రమంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడం వంటి కార్యక్రమాలను పూర్తిచేశామన్నారు. వీటన్నింటి ఫలితంగా గ్రామానికి లోవోల్టేజ్ సమస్య లేకుండా పోయిందన్నారు. నాడు-

ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచి రహీమా బేగం హసేన

నేడు నిధులతో గ్రామంలోని మూడు ప్రాథమిక పాఠశాలలను ఆధునికీకరించామన్నారు. గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తికావస్తోందన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పుంత రోడ్డు నిర్మించామని, వాటిని గ్రావెల్ రోడ్లుగా త్వరలో మార్చుతామని తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయన్నారు. వీటితో మధుపేటలో, కుమ్మరిపేటలో రూ.15 లక్షల వ్యయంతో విద్యుత్ స్తంభాల మార్పిడి, ఇతర కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఎర్రచెరువు, సాగునీటి చెరువు నుంచి రైతులకు సాగునీరు తరలించేందుకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించేందుకు వ్యక్తిగతంగా చెరువు షట్టర్లను బాగు చేయడం, అనుసంధాన కాలువలను ఆధునికీకరించడం చేశామన్నారు. పోలవరం కాలువ నుంచి తరలుతున్న గోదావరి జలాలను తాగునీటిగా అందించేందుకు ఒక సాగునీటి చెరువు రిజర్వాయర్ ఏర్పాటు కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీని అభివృద్ధి చేసేందుకు ఎంఎల్‌ఎ పుప్పాల వాసు బాబుతో పాటు గ్రామ పంచాయతీ యాజమాన్యం సహాయ సహకారాలు అందజేస్తున్నారని వివరించారు.

జగనన్న-వాసన్న కాలనీలో అభివృద్ధి పనులు పరిశీలిస్తూ..

ధాన్యం బకాయి సొమ్ము చెల్లించాలి

రైతు సంఘం ఆధ్వర్యాన రైతుల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జాలిపూడిలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించి ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ముందుగా సొసైటీ సమీపంలోని రామాలయం వద్ద రైతులు, కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జనవరి 20 తర్వాత ధాన్యం అమ్మిన రైతులు, కౌలు రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ కాలేదన్నారు. రైతులు ధాన్యం తోలి 35 రోజులు కావస్తున్నా ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించకపోవడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన ట్రక్ షీట్లలో మాత్రం 21 రోజుల లోపుగా ధాన్యం డబ్బులు చెల్లిస్తామని రాశారని చెప్పారు. రైతులు ధాన్యం అమ్మిన రెండు, మూడు రోజుల్లోనే ధాన్యం సొమ్ములు చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటుందని, ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా ఉందన్నారు. నెల రోజులు దాటిపోతున్నా ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించడం లేదని చెప్పారు. ఖరీఫ్ పంట అప్పులు చెల్లించకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని, మరోవైపు రబీ పంట సాగు పెట్టుబడికి చేతిలో చిల్లి గవ్వలేక అన్నదాతలు అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖరీఫ్ ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జాలిపూడి రైతు భరోసా కేంద్రం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సొసైటీ మాజీ అధ్యక్షులు నందిగం రమేష్ మాట్లాడుతూ ధాన్యం బకాయిలు చెల్లించకపోవడం వల్ల అపరాల పంటను ఆశించిన తెగుళ్ల నివారణకు పురుగుమందులు సైతం కొనుగోలు చేయలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం సొమ్ముల నిధుల విడుదలకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లూరి సుబ్బారావు, దొనకొండ బాబురావు, పంపన సత్యనారాయణ, ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాలిపూడిలో నిరసన తెలుపుతున్న రైతులు

పర్యావరణహిత గ్రామంగా 'సూరప్పగూడెం'

ప్రజాశక్తి - భీమడోలు

సూరప్పగూడెం గ్రామాన్ని పర్యావరణహిత, పారిశుధ్య పరిరక్షణ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు తమ వంతు సహకారాన్ని అందజేయాలని గ్రామ సర్పంచి వెజ్జు బాలాజీ నాయుడు, గ్రామపంచాయతీ కార్యదర్శి ముత్తయ్య కోరారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ పథకంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణకు వేరువేరుగా ప్రత్యేకించిన ప్లాస్టిక్ బుట్టలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. తడి చెత్తను వివిధ ప్రక్రియల ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చి అమ్మటం ద్వారా గ్రామపంచాయతీకి అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఇదే క్రమంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కల సంరక్షణకు ఎరువులుగా వాడుతున్నట్లు తెలిపారు. పొడి చెత్తలో భాగంగా సేకరించిన ప్లాస్టిక్, గాజు, ఇతర వ్యర్థాలను విడదీసి వాటి పునర్వినియోగానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీని ద్వారా కూడా గ్రామపంచాయతీకి ఆదాయం సమకూర్తుందని తెలిపారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యురాలు ఎం.కృష్ణకుమారి ఇవే విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ బుట్టల పంపిణీలో భాగస్వాములయ్యారు.

డస్టుబిన్లు అందజేస్తున్న పాలకవర్గ సభ్యులు

ఎన్నికల్లో విజయానికి పోలింగ్ బూత్ కమిటీలే కీలకం

వైసిపి కార్యకర్తల సమావేశంలో ఎంఎల్‌ఎ వాసుబాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించాలంటే పోలింగు బూత్ కమిటీలు ఎంతో కీలకంగా వ్యవహరించాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు పిలుపునిచ్చారు. ఉంగుటూరు, భీమడోలు మండలాలకు చెందిన వైసిపి కార్యకర్తలు, నాయకులు, పోలింగు బూత్ కన్వీనర్లతో భారీ బహిరంగ సభ ఆదివారం రాత్రి నారాయణపురం నయారా పెట్రోలు బంక్ సమీపంలో నిర్వహించారు. ప్రతి ఒక్క ఓటును సైతం ఖచ్చితంగా వేసేలా ఎప్పటికప్పుడు సమ న్వయంతో పోలింగు బూత్ కన్వీనర్లు, కేడర్ కీలకంగా వ్యవహరించాల్సిన విధి విధానాలపై ఎంఎల్‌ఎ వివరించారు. పోల్ మేనేజ్‌మెంట్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు తీసుకున్న లబ్ధిదారులు వైసిపి వైపే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తూ అందుకు మీరంతా కష్టపడి పనిచేయాలని కోరారు. వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఉంగుటూరు ఎఎంసి మాజీ చైర్మన్ మరడ రమావతి, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వాసుబాబు

ఎన్నికల్లో టిడిపి, జనసేన విజయం తథ్యం

భవిష్యత్తు గ్యారెంటీలో దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

దెందులూరు: వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన విజయం తథ్యమని దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పెదపాడు మండలం ఏపూరులో ఆదివారం జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి పాలనతో, లక్షల కోట్ల రూపాయల అక్రమార్జనే లక్ష్యంగా అధికారం చేపట్టిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని సహజ వనరులను కొల్లగొట్టి, ఇసుక, మట్టి అక్రమ త్రవ్వకాలతో, అక్రమ మద్యం అమ్మకాలతో, అధిక ధరలతో పేదవాడి జేబుకి చిల్లు పెట్టి రాష్ట్ర ప్రజల లక్షల కోట్ల రూపాయల సొమ్మును నిలువునా దోచేశారని విమర్శించారు. జగన్ దోపిడీ ప్రభుత్వాన్ని గద్దె దించి టిడిపి-జనసేన కూటమికి అధికారం ఇవ్వటానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మరో 2 నెలల్లో ఈ నియంత పాలన పోయి, టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వచ్చి, ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అన్నారు. చంద్రన్న ప్రవేశ పెట్టిన మహిళాశక్తి పథకం ద్వారా మహిళలకు అన్ని విధాలా అండగా ఉంటామని అన్నారు. తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతూ ఉంటే వారందరికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున ప్రతి బిడ్డకు అందిస్తామన్నారు. అలాగే 18 సంవత్సరాలు దాటిని ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇచ్చి వారికి ఒక అన్నగా, తండ్రిగా అండగా ఉంటామని అన్నారు. మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. ఇవే కాకుండా మహిళలకు సంక్షేమంతో పాటు రక్షణ కూడా కల్పిస్తామని, రాబోయే ఎన్నికల్లో మహిళలంతా టిడిపి, జనసేన కూటమికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని చింతమనేని ప్రభాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో పెదపాడు పార్టీ మండల అధ్యక్షులు లావేటి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌ఛార్జి గుత్తా అనిల్, గ్రామ అధ్యక్షులు కాసగాని రాజు, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ పాల్గొన్నారు.

చింతలపూడి : భవిష్యత్తు గ్యారెంటీలో సొంగా రోషన్

చింతలపూడి: 2024 సంవత్సరంలో టిడిపి అధికారంలోకి వస్తుందని చింతలపూడి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి నియోజవర్గం లింగపాలెం మండలం వేములపల్లి గ్రామంలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేములపల్లి గ్రామ ప్రజలు టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి సొంగ రోషన్ కుమార్‌కి పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేములపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి, ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల ప్రజలకు మంచి రోజులు వస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పార్క్ పున : ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు వసంతమహాల్ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు పార్క్ ఆధునీకరణ, సుందరీకరణ అభివృద్ధి పూరైన సందర్బంగా ఆదివారం ఎంఎల్‌ఎ ఆళ్లనాని పున: ప్రారంభించారు. ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నుంచి రూ.12 లక్షల నిధులతో సుందరీకరణ చేపట్టడం జరిగింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డిప్యూటీ సిఎం, ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని విచ్చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ పార్కు డెవలప్మెంట్ నిమిత్తం ఆర్యవైశ్య సంఘ పెద్దలు ఆళ్ల నానిని అభ్యర్థించగా ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నిధులలో రూ.12 లక్షలను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఆర్ఎమ్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేసి శ్రీనివాస్, నుకపెయ్యి సుధీర్ బాబు, ఏలూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నెర్సు చిరంజీవి, అన్ని విభాగాల ఛైర్మన్లు, ఈడా విసి, కార్పొరేటర్లు, వైసిపి కోఆప్షన్ సభ్యులు, ఏలూరు ఆర్యవైశ్య సంఘం పెద్దలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న చర్చి సభ్యులు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని ఆర్‌సిఎం సహాయ మాత చర్చి ఆధ్వర్యంలో ఆదివారం పేద ప్రజలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మండలంలోని పేయ్యేరు పంచాయతీ శివారు వైఎస్ఆర్ కాలనీలో నివసిస్తున్న 50 మంది నిరుపేద ప్రజలకు, వృద్ధులకు పునీత విన్సెంట్ డి పాల్ సొసైటీ ఆధ్వర్యంలో సమకూర్చిన దుప్పట్లను ముదినేపల్లి ఆర్‌సిఎం చర్చి విచారణ కౌన్సిల్ ఛైర్మన్ పోలాకు అప్పారావు చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ మాతంగి మరియా కుమార్, సహాయ గురువులు విజయ్ కుమార్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలువురి వైద్య ఖర్చులకు కొడాలి వినోద్ ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన వీర్ల వెంకటరత్నం కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఉండగా గ్రామ నాయకుల సమాచారం మేరకు టిడిపి నాయకులు కొడాలి వినోద్ వారిని పరామర్శించి వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. వైద్య ఖర్చుల నిమిత్తం వీర్ల వెంకటరత్నంకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ముదినేపల్లికి చెందిన బత్తిన వెంకటేశ్వరరావు అనే వ్యక్తి గత కొంత కాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఉండగా వారికి వైద్యం నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదగొన్నూరు పంచాయతీ శివారు విశ్వనాద్రిపాలెంలో కోదండ రామాలయం నిర్మాణం నిమిత్తం బికెయం చారిటబుల్ ట్రస్టు తరఫున చారిటబుల్ ట్రస్టు సభ్యుడు దావు నాగరాజు ఆదివారం విరాళం అందజేశారు. రూ.10 వేల చెక్కును దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్మాణం కమిటీ సభ్యులు వీరంకి చక్రపాణి, తోట నాగిని, పరసా ఏసుబాబు, అనగాని గణపతి, రోకం సత్యనారాయణ, వీరంకి శ్రీనివాసరావు, బొమ్మనబోయిన నాగరాజు పాల్గొన్నారు.